క్లుప్తంగా

కాలుష్య పరిశ్రమలపై చర్యలేవి?

కొత్తూరు: మండల కేంద్రం సమీపంలోని పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ పాటించకుండా కొనసాగుతున్న పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి షకీల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లెడ్ బట్టీలు, పాత టైర్లను కాల్చే పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో ఘాటైన వాయు కాలుష్యం వెలువడుతుందన్నారు. వీటి నిర్వాహకులు సరైన అనుమతులు పొందకుండా కొందరు నాయకులు, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా పీసీబీ, రెవెన్యూ అధికారులు స్పందించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

స్కావెంజర్లను నియమించండి

టీపీయూఎస్ గౌరవ అధ్యక్షుడు సురధీర్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి పాఠశాలల పరిశుభ్రతకు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ పేర్కొన్నారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీఓ 317 ద్వారా స్థానికతను తుంగలో తొక్కారని, జిల్లాలకు బదిలీ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులను తిరిగి స్థానికత ఆధారంగా వారివారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెం.57తో 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంతో ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించి పీఆర్సీని ప్రకటించాలన్నారు. న్యాయపరమైన వివాదాలను పరిష్కరించి మల్టిజోన్ 2లో నిలిచిపోయిన బదిలీలను, పదోన్నతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యపై స్పందించాలని వారు కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి తులసి



అప్‌డేట్ చేయిస్తున్న వ్యవసాయాధికారులు

చేవెళ్ల: పీఎం కిసాన్ డబ్బుల కోసం తప్పనిసరిగా ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి పేర్కొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఆదివారం వ్యవసాయాధికారులు పర్యటించారు. అక్కడ ఈకేవైసీ అప్‌డేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందుగానే డప్పుచాటింపు వేయించి అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు విడుతల్లో రూ.6వేలు వారి ఖాతాలో జమచేస్తున్నారన్నారు. అయితే ఎప్పటికప్పుడు రైతుల వివరాలు అప్‌డేట్ చేయిస్తూ అర్హులకు అందేవిధంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గతంలో ఎవరైనా భూములు అమ్ముకున్నా, కొత్త వారు తీసుకున్నా వారికికూడా ఈ పథకం కింద ప్రయోజనం చేకూరేవిధంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఏఓలు స్వాతి, ప్రియ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

కద్లాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక నాయకులు జైపాల్‌యాదవ్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, అశోక్, రాంచంద్రయ్య, రాజేందర్‌యాదవ్ ఉన్నారు.

మాజీ ఎంపీపీకి ఆహ్వానం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వెలిసిన వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎంపీపీ శ్రీనివాసయాదవ్‌ను ఆదివారం ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు అంబాజీ, శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మహేశ్ నేత, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అశోక్‌గుప్తా, మోహన్‌లాల్, నర్సింహ, విజయ్, రవి పాల్గొన్నారు.

ఆశలు ఆ'వరి'

నెర్రెలు బారుతున్న పొలాలు

- అడుగంటుతున్న బోరుబావులు
- మొరాయిస్తున్న మోటార్లు
- ఎండుతున్న పంటలు
- పలు ప్రాంతాల్లో అన్నదాతల ఆవేదన



షాబాద్: వరి పంట పొలాలకు సరిపడ నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. భూగర్భజలాలు ఇంకిపోవడం ఒక కారణమైతే, విద్యుత్ సరఫరాలో అంతరాయం మరో కారణంగా ఉంది. అందులో భాగంగానే లోటల్టేజీ సమస్యతో నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. లోటల్టేజీతో వరి, మొక్కజొన్న పంటలు ఎండుముఖం పట్టాయి. పంటల కోసం రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి అప్పులే మిగిలేలా ఉందని వారు ఆందోళనకు గురవుతున్నారు. రోజురోజుకు బోరు బావుల్లో నీరు అడుగంటుతున్నాయి. ఎకరం పొలం తడవాలంటే రెండు రోజుల సమయం పడుతుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గతంలో ఎన్నడూ లేదు

షాబాద్ మండలంలో గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి రాలేదని రైతులు చెబుతున్నారు. షాబాద్, కొమరబండ, బొబ్బిలిగామ, ఎర్రోనిగూడ, ఊబ్బగుంట తదితర గ్రామాలకు చెందిన రైతుల పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని వారు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మండలంలోనే కాదు. జిల్లాలోని మిగతా చోట్ల కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది సరైన స్థాయిలో వర్షాలు కురవలేదు. అందుకు బోరు బావుల్లో తగినంత నీరు చేరలేదు.

బోరుబావుల వద్ద పరిస్థితి దారుణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పొలాలు అక్కడక్కడ నెర్రెలు బారాయి. బోరు బావుల కింద వరి సాగు చేసే రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇదే పరిస్థితి కొనసాగితే వారం రోజుల్లో వరి పొలాలను వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5:45నిమిషాల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అందులో కెపాసిటర్ బ్యాంక్ లేకపోవడంతో లోటల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పంట ఎండుతోంది



లోటల్టేజీ సమస్యతో పంటలు ఎండుతున్నాయి. 2 ఎకరాలు వరి సాగు కోసం రూ.80 వేల అప్పులు చేశాను. కష్టపడి వరి సాగు చేస్తే లోటల్టేజీ సమస్యతో వేసిన పంట ఎండుముఖం పడుతుంది. చేసిన కష్టం చేతికి రాకుండా పోతుందేమోనని బాధగా ఉంది. -చంద్రబాబు, రైతు, షాబాద్

పశువులకు మేతగా..



ఎకరం వరి పంటను సాగు చేశా.కళ్ల ముందే పంట ఎండిపోతుంటే ఏమీ చేయలేని పరిస్థితి దాపురించింది. బోరులో పుష్కలంగా నీరు ఉన్నా, అక్కడక్కడ కరెంట్ సరఫరాలో లోపం శాపంగా మారింది. 2 స్టార్టర్లు, ఒక మోటారు కాలిపోయింది. -యాదిరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

పాలకులు స్పందించాలి



రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే లోటల్టేజీతో కళ్ల ముందే ఎండిపోతున్నాయి. తడి లేక పొలాలు నెర్రలు చాస్తున్నాయి. -గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్

ఏసీపీ కిషన్‌కి అభినందనల వెల్లువ



ఏసీపీ కిషన్‌తో తంగడపల్లి బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీ బి కిషన్‌ను మండలంలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆదివారం చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో తంగడపల్లికి చెందిన రాములు (రాజు), సత్తయ్య, చంద్రయ్యగౌడ్, సుధాకర్, గోపాల్‌లు సన్మానం చేసి స్వాగతం పలికారు.

కాంగ్రెస్ నాయకులు..

పీఏసీఎస్ డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బి ఆగిరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జె శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



శివరామాంజనేయ స్వామి దేవాలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామంలో ఆదివారం శివరామాంజనేయ స్వామి దేవాలయంలో నాభిశిల, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ, గణపతి విగ్రహ ప్రతిష్ఠతోపాటు, కుమారస్వామి, నందీశ్వరస్వామి, పోచమ్మ, శ్రీకృష్ణుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, ఎంపీటీసీలు సత్యనారాయణ రెడ్డి, రజిత, చంద్రశేఖర్, బాల్‌రాజ్, నర్సింలు, పాపయ్య, సురేందర్, శేఖర్, రాములు నాయక్, రాజు, రాములు, శ్రీను, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

కేజీబీవీ హాస్టల్ రోడ్డును అభివృద్ధి చేయండి

కొత్తూరు: మండల కేంద్రం నుంచి కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు అభివృద్ధి చేయని కారణంగా అటువైపుగా వెళ్లే విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దానికి తోడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి, రాత్రిళ్లు అక్కడి పరిసరాలు భయాందోళనను కలిగిస్తున్నాయని వారు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖల అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామస్వామి



పాల్గొన్న వైద్యులు, సీపీఐ నాయకులు

చేవెళ్ల: ప్రజలు తమ ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె రామస్వామి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్-2లో ఆదివారం సోమాజీగూడకు చెందిన సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు, సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఏడాదికోసారి ప్రజలు తమ ఆరోగ్య రక్షణకు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ అధికారి డాక్టర్ నిహాల్ అహ్మద్, డాక్టర్ మహ్మద్ మస్తాన్, సాయితేజ, రాజశ్రీ, అబూ సోఫియాన్, సందీప్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, సుగుణమ్మ, వెంకటమ్మ, భాగ్యమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి ప్రాధాన్యత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన నిధులతో అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆదివారం హైదరాబాద్‌లో నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కసిరెడ్డిని సత్కరించారు. అనంతరం విద్యానగర్ కాలనీలోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో లో ఓల్టేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని వివరించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీసీ రోడ్లు నిర్మించాలని, కమ్యూనిటీహాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పాలకవర్గం, ప్రజల సహకారంతో ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్‌కాలనీసంఘం అధ్యక్షుడు పాషా, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు శేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పత్యానాయక్, పర్వతాలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాఘ మాసం ఎంతో పవిత్రమైనది

హిందూ జ్ఞానవేదిక కమిటీ కార్యవర్గ సభ్యుడు నాగ్యా నాయక్



భగవద్గీత విశిష్టతను వివరిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

కొందుర్గు: హిందూ మత సిద్ధాంతం ప్రకారం మాఘ మాసం ఎంతో పవిత్రమైనదని త్రైత సిద్ధాంతం ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదిక మహబూబ్‌నగర్ కమిటీ కార్యవర్గ సభ్యుడు నాగ్యా నాయక్ అన్నారు. ఆదివారం కొందుర్గు మండలంలోని ఆగిర్యాలలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత, అనుబంధ గ్రంథాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా నాగ్యానాయక్ మాట్లాడుతూ మాఘ పూర్ణిమ భగవంతుడి జన్మను తెలియజేస్తుందని, సాకార భగవంతుడికి గర్భగుడి ఉంటుందని వివరించారు. సప్త నాడీ కేంద్రాలను గుడి గోపురంలోని ఏడు ద్వారాలుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిలింగం, అమ్ములు, రజిత, వెంకటేశ్, కిశోర్, కృష్ణయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఆరాధ్య పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 19న (సోమవారం) ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన కిషన్ కుమార్తె వివాహానికి తండాకు చెందిన రాత్లావత్‌రమేశ్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. తండాలో వివాహం చేసుకునే ఆడపడుచులకు రూ.10 వేలు సాయం అందిస్తామని రాత్లావత్ రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు జయరాంనాయక్, నందురాథోడ్, వినోద్‌నాయక్, కిషన్ పాల్గొన్నారు.

న్యాయ యాత్రకు నాయకులు

తలకొండపల్లి: పాలమూరు న్యాయయాత్ర చేపట్టిన ఏఐసీసీ నాయకుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ యాత్ర మహబూబ్‌నగర్ నియోజకవర్గం రాజాపూర్‌లో కొనసాగుతోంది. పాదయాత్రలో ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

కాంగ్రెస్ నేత వీరమోని దేవేందర్‌ముదిరాజ్



మాట్లాడుతున్న దేవేందర్‌ముదిరాజ్

కొత్తూరు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితోనే మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు కాంగ్రెస్ నేత వీరమోని దేవేందర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం పలువురు నాయకులతో కలిసి పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొత్తూరు పట్టణానికి నీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లు నందిగామ వద్ద ధ్వంసమైనట్లు తెలిపారు. 18 నెలలుగా వాటిని మరమ్మతులు చేసే వారు కరువయ్యారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులను కోరినా సరైన స్పందన లేదన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో భూగర్భ జలాలు చాలా వరకు కలుషితం కావడంతో మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డట్లు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే నీటి సరఫరా అంశంపై అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులను పూర్తి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన పేర్కొన్నారు. కొన్ని చోట్ల లీకేజీలు ఉండడంతో పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు మరికొన్ని రోజులు పడుతుందని వారు వివరించారు. నీటి పునరుద్ధరణపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తేజేశ్వర్, శ్రీను, మహిపాల్, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు

- రక్షణ చర్యలు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



సిద్ధాపూర్ వద్ద మూల మలుపు

కొత్తూరు: ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై ఉన్న మూల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనదారులు గాయపడుతునే ఉన్నారు. మండలంలో ప్రమాదకరంగా మారిన మలుపులను సంబంధిత అధికారులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. మండలంలోని పెంజర్ల నుంచి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ విషయంలో స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మలుపు వద్ద వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైన ఈ విషయంలో అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతిభీంభరత్

మొయినాబాద్ రూరల్: గ్రామాల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతిభీంభరత్, ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం అమ్డాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి 50 మంది బీఆర్ఎస్ నాయకులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సర్పంచులు గ్రామాలలో అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకున్న, వారి సొంత డబ్బులను వెచ్చించి గ్రామాల అభివృద్ధికి సహకరించారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి గ్రామాల కోసం పెట్టిన బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ మారినట్టు సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి తెలిపారు. షాబాద్ దర్శన్, తమ్మలి మాణయ్య, జైపాల్ రెడ్డి, పెంటారెడ్డి, భిక్షపతిముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, విజయ్‌రాజ్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, మహేందర్, నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.



రవళిగోపికృష్ణారెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న జ్యోతిభీంభరత్

ఘన నివాళి



షాద్‌నగర్ రూరల్: నివాళి అర్పిస్తున్న లక్ష్మణ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ కవి, కళాకారుడు, గాయకుడు, ఉద్యమకారుడు పాపకంటి శేఖర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం యువసత్తాయూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్యకూడలిలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో తన ఆటా, పాటలతో చైతన్యవంతులను చేశారని గుర్తు చేశారు. స్వ రాష్ట్రాన్ని చూడకుండానే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాధవాచారి, రాము, రాజు, నర్సింహ్మ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామికి..

షాబాద్: వేలాది మంది అయ్యప్ప స్వాములకు గురుస్వామి సతీషన్ నాయర్ ఆదర్శప్రాయుడని స్మరించుకున్నారు. నందిగామ మండల పారిశ్రామిక వాడలోని అయ్యప్ప ఆలయంలో గురుస్వామిగా ఉండేవారు. వేలాది మందికి ఆయన మాలధారణ చేసేవారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే మండలంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. షాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సతీషన్‌నాయర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, లింగం, శేఖర్, భీమయ్య, వెంకటయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.